## బీద విధవరాలు

**యేసయ్య సాటిలేని నామములో మీకు శుభములు కలుగును గాక!**

లూకా 21 : 1-4 - **కానుక పెట్టెలో తమ కానుకలను వేయుచున్న ధనవంతులను ఆయన పారజూచెను. ఒక బీద విధవరాలు రెండు కాసులు అందులో వేయుచుండగా చూచి ఈ బీద విధవరాలు అందరికంటె ఎక్కువ వేసెనని మీతో నిజముగా చెప్పుచున్నాను. వారందరు తమకు కలిగిన సమృద్ధిలోనుండి కానుకలు వేసిరిగాని యీమె తన లేమిలో తనకు కలిగిన జీవనమంతయు వేసెనని వారితో చెప్పెను.**

పరిశుద్ధ గ్రంథములో చాలా మంది విధవరాండ్రను మనము గమనించవచ్చు. దేవుడు విధవరాండ్ర పట్ల చాల ప్రేమ చూపించినాడు. దేవుని దృష్టిలో వారు ప్రత్యేకం. అలాగుననే విధవరాండ్రు దేవుని మీద చూపిన ప్రేమ మాటలలో వర్ణించలేనిది.

### మొదటగా దేవునికి వారి పట్ల కలిగి ఉన్న శ్రద్ధను గమనిద్దాం :

1. **విధవరాలికి న్యాయము తీర్చే దేవుడు :**

   ద్వితీ 10:18 **ఆయన తలిదండ్రులు లేనివానికిని విధవరాలికిని న్యాయము తీర్చి, పరదేశియందు దయ యుంచి అన్నవస్త్రముల ననుగ్రహించువాడు.**

2. **విధవరాలిని కనికరించు దేవుడు :**

   లూకా 7: 12-15 ఆయన ఆ ఊరి గవినియొద్దకు వచ్చి నప్పుడు, చనిపోయిన యొకడు వెలుపలికి మోసికొని పోబడుచుండెను; అతని తల్లికి అతడొక్కడే కుమారుడు, **ఆమె విధవరాలు;** ఆ ఊరి జనులు అనేకులు ఆమెతో కూడ ఉండిరి. ప్రభువు ఆమెను చూచి ఆమెయందు **కనికరపడి**--ఏడువవద్దని ఆమెతో చెప్పి, దగ్గరకు వచ్చి పాడెను ముట్టగా మోయుచున్నవారు నిలిచిరి. ఆయన చిన్నవాడా, లెమ్మని నీతో చెప్పుచున్నాననగా ఆ చనిపోయిన వాడు లేచి కూర్చుండి మాటలాడసాగెను; ఆయన అతనిని అతని తల్లికి అప్పగించెను.

3. **విధవరాలిని ఆదరించు దేవుడు :**

   కీర్తన 146:9 యెహోవా పరదేశులను కాపాడువాడు ఆయన తండ్రిలేనివారిని **విధవరాండ్రను ఆదరించువాడు.**

4. **విధవరాలిని పోషించు దేవుడు:**

2 Kings(రెండవ రాజులు) 4:7 - ఆమె దైవజనుడైన అతని యొద్దకు వచ్చి సంగతి తెలియజెప్పగా అతడు నీవు పోయి ఆ నూనెను అమ్మి నీ అప్పు తీర్చి మిగిలిన దానితో నీవును నీ పిల్లలును బ్రదుకుడని ఆమెతో చెప్పెను.

5. **విధవరాలి పొలిమేర స్థాపించు దేవుడు :**

Proverbs(సామెతలు) 15:25 - గర్విష్ఠుల యిల్లు యెహోవా పెరికివేయును విధవరాలి పొలిమేరను ఆయన స్థాపించును.

6. **విధవరాలి పక్షాన సాక్ష్యము పలుకు దేవుడు :**

Malachi(మలాకీ) 3:5 - తీర్పు తీర్చుటకై నేను మీయొద్దకు రాగా, చిల్లంగివాండ్ర మీదను వ్యభిచారుల మీదను అప్రమాణికులమీదను, నాకు భయపడక వారి కూలి విషయములో కూలివారిని విధవరాండ్రను తండ్రిలేనివారిని బాధపెట్టి పరదేశులకు అన్యాయము చేయువారి మీదను దృఢముగా సాక్ష్యము పలుకుదునని సైన్యములకు అధిపతియగు యెహోవా సెలవిచ్చుచున్నాడు.

7. **విధవరాలు ఏడ్వటం ఇష్టపడని దేవుడు :**

Luke(లూకా సువార్త) 7:12,13 - ఆయన ఆ ఊరి గవినియొద్దకు వచ్చినప్పుడు, చనిపోయిన యొకడు వెలుపలికి మోసికొని పోబడుచుండెను; అతని తల్లికి అతడొక్కడే కుమారుడు, ఆమె విధవరాలు; ఆ ఊరి జనులు అనేకులు ఆమెతో కూడ ఉండిరి.

ప్రభువు ఆమెను చూచి ఆమెయందు కనికరపడి--ఏడువవద్దని ఆమెతో చెప్పి దగ్గరకు వచ్చి పాడెను ముట్టగా మోయుచున్నవారు నిలిచిరి.

## పరిశుద్ధ గ్రంధములో వ్రాయబడిన కొంతమంది విధవరాండ్రు :

- **దేవాలయమును విడువని విధవరాలు:**

  లూకా 2: 37 యెనుబది నాలుగు సంవత్సరములు విధవరాలైయుండి, దేవాలయము విడువక ఉపవాస ప్రార్థనలతో రేయింబగళ్లు సేవచేయుచుండెను.

  మనము మందిరములో 2గంటలు కూర్చోలేకపోతున్నాము అటువంటిది 84 సంవత్సరములు మందిరములో నివసించడం ద్వారా ఆమె దేవునిని , దేవాలయాన్ని ఎంతగా ప్రేమించిందో అర్థం చేసుకోవచ్చు.

◈ **ప్రవక్తను పోషించిన విధవరాలు :**

1రాజులు 17 :8-9 - అంతట యెహోవా వాక్కు అతనికి ప్రత్యక్షమై యీలాగు సెలవిచ్చెను. నీవు సీదోను పట్టణ సంబంధ మైన సారెపతు అను ఊరికి పోయి అచ్చట ఉండుము; నిన్ను పోషించుటకు అచ్చటనున్న యొక విధవరాలికి నేను సెలవిచ్చితిని.

**ఇక్కడ దేవుని అద్బుతమైన ప్రణాళిక చూస్తున్నాము. దేవుడు ప్రవక్తని ఆమె యొద్దకు పంపించుట వెనుక బలమైన కారణము ఆ విధవరాలిని పోషించుటకు, ఆమె పాపమును జ్ఞాపకము చేయుటకు, చనిపోబోయే తన కుమారుని చనిపోయిన తరువాత అద్బుతము చేయుట ద్వారా తిరిగి బ్రతికించుటకు అని మనము అర్ధము చేసుకోవాలి.**

## విధవరాండ్ర పట్ల మన భాద్యత:

- **పరామర్శించాలి :**

  James(యాకోబు) 1:27 - తండ్రియైన దేవునియెదుట పవిత్రమును నిష్కళంకమునైన భక్తి యేదనగా దిక్కులేని పిల్లలను విధవరాండ్రను వారి యిబ్బందిలో పరామర్శించుటయు, ఇహలోకమాలిన్యము తనకంటకుండ తన్ను తాను కాపాడుకొనుటయునే.

- **బాధపెట్ట కూడదు:**

  నిర్గమ 22 : 22 విధవరాలినైనను దిక్కులేని పిల్లనైనను **బాధపెట్ట కూడదు.**

- **చిన్న చూపు చూడకూడదు:**

  అ. కా. 6:1 ఆ దినములలో శిష్యుల సంఖ్య విస్తరించుచున్నప్పుడు అనుదిన పరిచర్యలో తమలోని **విధవరాండ్రను చిన్న చూపు చూచిరని** హెబ్రీయులమీద గ్రీకుభాష మాట్లాడు యూదులు సణుగసాగిరి.

- **విధవరాలి పక్షముగా వాదించాలి:**

  యెషయా 1:17 కీడుచేయుట మానుడి మేలుచేయ నేర్చుకొనుడి న్యాయము జాగ్రత్తగా విచారించుడి, హింసించబడు వానిని విడిపించుడి, తండ్రిలేనివానికి న్యాయము తీర్చుడి, **విధవరాలి పక్షముగా వాదించుడి**

- **విధవరాలి వస్త్రమును తాకట్టుగా తీసికొనకూడదు:**

  ద్వితీ 10:18 విధవరాలి వస్త్రమును **తాకట్టుగా తీసికొనకూడదు.**

విధవరాండ్రను సన్మానింపుము:

1 తిమోతి 5 : 3 నిజముగా అనాథలైన విధవరాండ్రను సన్మానింపుము.

**ఈ లోకములో ఎవరైతే విడవరాండ్ర పట్ల ప్రేమ కలిగి జీవిస్తారో వారిని దేవుడు ఖచ్చితముగా ఆశీర్వదిస్తాడు.**

*ఇప్పుడు మనము బీద విధవరాలిని గురించి ధ్యానం చేద్దాం :*

_బీద విధవరాలిని గూర్చి యేసుక్రీస్తు వారు ఇచ్చిన సాక్ష్యం చాలా గొప్పది . పరిశుద్ధగ్రంధమందలి అనేక మంది విధవరాండ్రు ఉన్నప్పటికీ ఈ విధవరాలు మాత్రం ప్రత్యేకం. యేసుక్రీస్తు వారే సాక్ష్యమిచ్చారు అంటే ఆమె జీవితం నుండి మనము చాలానే నేర్చుకోవాలి. అలా చేసిన ఈ ప్రయత్నము ద్వారా దేవుడు బయలు పరచిన సత్యాలు............అందరి ముందుకు!

* బీదరాలు:

లూకా 21 : 2 ఒక బీద విధవరాలు రెండు కాసులు అందులో వేయుచుండగా చూచి

పై లేఖనభాగములో గమనిస్తే ఆమె బీదరాలు అని గమనించవచ్చు. 1వ వచనములో కానుక పెట్టెలో తమ కానుకలను వేయుచున్న ధనవంతులను ఆయన పారజూచెను అని వున్నది. అంటే అక్కడ చాలామంది ధనవంతులు కానుకలు వేస్తున్నారు . అంతమంది ధనవంతులలో ఆమె బీదరాలు అని యేసుక్రీస్తు వారు గుర్తించారు. మన స్థితి దేవుడు చూస్తున్నాడని మనము అర్ధము చేసుకోవాలి.

* విధవరాలు :

లూకా 21: 2 ఆమె బీదరాలు మాత్రమే కాదు, విధవరాలు కూడా.

అంటే ఈ లోకములో ఆమెకు భర్త లేడు. ఆమెను పోషించడానికి ఎవరు లేరు. ఆమె ఎంత దీన స్థితిలో వుందో మనము అర్థం చేసుకోవాలి.

* కానుక పెట్టెలో కానుక వేయుట :

లూకా 21:2 ఒక బీద విధవరాలు రెండు కాసులు అందులో వేయుచుండగా చూచి

రెండు కాసులు అందులో వేయుచుండగా చూచి ఆమె బీదరాలు, విధవరాలు అయినా కానుక వేయడానికి వచ్చింది. దేవుడు పెట్టిన క్రమమును పాటిస్తుంది. అంటే ఆమె దేవుని యెడల భయము భక్తి కలిగిన స్త్రీ అని మనము అర్థం చేసుకోవాలి .

* **ఏ స్థితిలో కానుక వేసింది:**

లూకా 21: 4 యీమె తన లేమిలో తనకు కలిగిన జీవనమంతయు వేసెనని వారితో చెప్పెను

**తన లేమిలో వేసింది అంటే తన దగ్గర తినటానికి తిండి కూడా సరిగా లేదు అని అర్థం. ఆమెను చూసి మనము సిగ్గు తెచ్చుకోవాలి అనేకమంది ధనవంతులను ఆయన లక్ష్య పెట్టలేదు కాని లేమిలో వేసిన ఈమెను అయన చూస్తున్నాడు .**

* **యేసుక్రీస్తు ఆమెను చూచినారు :**

లూకా 21:2 ఒక బీద విధవరాలు రెండు కాసులు అందులో వేయుచుండగా చూచి.

**ఆయన ధనవంతులనందరని పారచూచెను కాని ఈ విధవరాలిని మాత్రము ప్రత్యేకముగా చూచినాడు. యేసుక్రీస్తు దృష్టిని ఆమె వైపు తిప్పుకోగలిగింది.**

## రెండవ కాసు ప్రాముఖ్యత

* **జీవనమంత వేసింది:**

లూకా 21: 4 వారందరు తమకు కలిగిన సమృద్ధిలోనుండి కానుకలు వేసిరిగాని యీమె తన లేమిలో తనకు కలిగిన జీవనమంతయు వేసెనని వారితో చెప్పెను.

**లేమిలో వేయడం మాత్రమేకాదు తన జీవన మంతయు వేసింది. అంటే తనకు బ్రతకడానికి ఇంక ఏమి దాచుకోలేదు. ఆమె దగ్గర రెండు కాసులు మాత్రమే వున్నాయి ఆమె ఒక కాసు వేసి వుంటే ఆమె జీవనమంత వేసింది అని చెప్పగలిగే వారము కాదు. ఈ రోజు పరిశుద్ధగ్రంధములో ఆమె పేరు వుంది అంటే ఆమె వేసిన రెండవ కాసు కారణము. ఆ రెండవ కాసే ఆమె జీవనమంత అని సాక్ష్యము సంపాదించ కలిగింది. మొదటి కాసు ఆమె ఆజ్ఞ పాటించింది అని చెప్పవచ్చు, కాని రెండవ కాసు ఆమె త్యాగము చేసింది అని చెప్పవచ్చు.**

**ఈ లోకములో తనకు భర్త లేడు, తనను సృజించిన వాడే తనకు భర్త అని నమ్మి(యెషయా 54:5 నిన్ను సృష్టించినవాడు నీకు భర్తయైయున్నాడు సైన్యములకధిపతియగు యెహోవా అని ఆయనకు పేరు. ఇశ్రాయేలుయొక్క పరిశుద్ధదేవుడు నీకు విమోచకుడు సర్వలోకమునకు దేవుడని ఆయనకు పేరు.) తన పరలోక భర్త దగ్గరకు వెళ్ళడానికి సిద్ధపడింది. అందుకే రెండవ కాసు తన దగ్గర వుంటే ఇంకా ఈ లోకములో ఉండవలసి వస్తుందేమో అని, అది వ్యర్ధము అని తలచి పరలోక భర్తను చేరుకోవాలంటే రెండవ కాసు తన దగ్గర వుండ కూడదు అని తీర్మానము తీసుకుంది.**

అందుకే ఆ రెండవ కాసు వేసింది. ప్రియమైన వారలారా ఈ రెండవ కాసు గురించి జాగ్రత్త. ఈ లోకాన్ని విడిచినప్పుడు మాత్రమే మనము పరలోకాన్ని చేరగలము. మన జీవితాలలో ఈ రెండవ కాసు ఏదైనా కావచ్చు (ఉద్యోగం-వ్యాపారము, ఆస్తి-అంతస్థు, కుటుంబము, స్నేహితులు, వాహనాలు, etc....)

**మీకు అర్ధం కావడానికి :**

| S NO | మొదటి కాసు | రెండవ కాసు |
|---|---|---|
| 1 | పాతనిబంధన క్రమము | క్రొత్త నిబంధన క్రమము |
| 2 | ఆజ్ఞ | త్యాగము |
| 3 | కానుక వేయుట | జీవనమునే వేయుట |
| 4 | ఈ లోకములో ఆశీర్వదించబడుటకు | పరలోకానికి సిద్ధపాటు |

జీవనమంత వేసిన ఆమెకు దేవుడు ఇచ్చిన గొప్ప ఆధిక్యత పరిశుద్ధ గ్రంధములో 4వచనములు ఆమె గురించి వ్రాయించెను.

**2 కాసులు = 4 వచనాలు**

మరి మనకు ఒక అవకాశము వుంది. మనము రెండవ కాసు వేస్తే జీవ గ్రంధములో మన పేరు వ్రాయబడుతుంది అది ఎంత ధన్యత, అటువంటి కృప మన అందరికి అనుగ్రహించాలని యేసుక్రీస్తుని ప్రార్థిస్తున్నాము.....

గమనిక: వాక్యపు వెలుగు సహవాసములో ప్రతి సంవత్సరము విధవరాండ్ర కొరకు ప్రత్యేకముగా క్రిస్మస్ (Widows Christmas) జరుపబడును.

ప్రతి శుభకార్యం విధవరాండ్రు, తల్లులు ప్రార్థించిన తరువాతే మొదలవుతుంది. విధవరాండ్ర పట్ల ప్రత్యేక శ్రద్ధ. దేవుని ఆజ్ఞలు మనం పాటిస్తూ మన పిల్లలకు నేర్పిద్దాం. విధవరాండ్రను లోకం హీనపరిస్తే, మనం ఘనపరచుదాం. వారి అవసరతలు మన స్థాయి, సామర్థ్యం మేరకు తీర్చుదాం. దేవునికి ఇష్టమైన పనులు చేస్తే మనం ఆయనకు ఇష్టులుగా మారతాము. ఈ Lent ఇందుకు ఒక ప్రత్యేకమైన, ప్రతిష్ఠత కలిగిన సమయంగా వాడుకుందాం.

ధర్మశాస్త్రం ఇచ్చి దానిని పాటించమని యెహోవా దేవుడు ఆజ్ఞ ఇచ్చినా, వేల సంవత్సరాలు దాటినా యేసు ప్రభువుకు ఒక బీద విధవరాలు తారసపడటం ఆశ్చర్యం. అంటే ఇశ్రాయేలు సమాజం విధవరాండ్రను పట్టించుకోలేదు. పట్టించుకుని ఉంటే ఆమె అలా ఉండేది కాదు. ఇశ్రాయేలులోని స్వార్థం మనకు కనబడుతుంది.

తనను ఎవరు పట్టించుకోకపోయినా తను మాత్రం దేవుని పట్ల ప్రేమ కలిగియుంది. మనం విధవరాండ్రను పట్టించుకుంటున్నామా? లేదా? పరిశీలించుకుందాం.

ప్రభువు చేత గొప్ప సాక్ష్యము పొందిన ఈ బీద విధవరాలు ఘనురాలు, ధన్యురాలు. మన సంఘాల్లోని విధవరాండ్రను దేవుడు ఆయురారోగ్యములతో, ఆత్మ వరములతో నింపి వాడుకొనును గాక. ఆమేన్.



ఈ చిత్రము మీకు అర్థము కావడం కోసము మాత్రమే .......గమనించగలరు